## గంజాయి కేసులో నిందితులకు జైలుశిక్ష

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గంజాయి కేసులో ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికి 20 ఏళ్ల జైలు శిక్ష, రెండు లక్షల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె. ఉమాదేవి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2021 ఏప్రిల్ 7న రఘునాథపాలెం పోలీసుల ఆధ్వర్యంలో వి. వెంకటాయపాలెం గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన కారును తనిఖీ చేయగా రూ. 30 లక్షల విలువైన 194 కేజీల గంజాయిని గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా అక్రమార్జన కోసం దొంకరాయి నుండి హైదరాబాద్‌కు గంజాయిని సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఎ1 నిందితునిగా మహబూబాబాద్ జిల్లా అననేయులు తండా దండేగా గ్రామానికి చెందిన బోడా వాల, ఎ2 నిందితునిగా బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన కొండపల్లి రవితేజ, ఎ3 నిందితునిగా సారపాకకు చెందిన బొజ్జ వంశీలపై రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నిందితులపై మోపిన అభియోగం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్‌కు సహకరించిన అప్పటి విచారణ అధికారులు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ వరాల శ్రీనివాస్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. శరత్‌కుమార్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ సాంబశివరావు, కోర్టు లైజనింగ్ కె. శ్రీకాంత్, హోంగార్డ్ ఆఫీసర్ ఎండి ఆయూబ్ లను పోలీస్ అధికారులు అభినందించారు.

## కలెక్టర్‌ను కలిసిన సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/పాల్వంచ :** సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం ఆధ్వర్యంలో సిపిఐ నాయకులు నూతనంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలను చేపట్టిన అంకిత్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి పూలబొకే అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, 47వ, డివిజన్ కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, నాయకులు బర్ల వెంకటరత్నం, నామా నవీన్, నామా పందు, లాల్‌పాషా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్స్‌ప్లరేషన్ కార్మికుల ప్రమోషన్ పాలసీని మెరుగుపరచాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎక్స్‌ప్లరేషన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న కార్మికుల ప్రమోషన్ పాలసీని మెరుగు పరచాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియూసి) కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌వి రమణమూర్తి అన్నారు. బదిలీపై వచ్చిన ఎక్స్‌ప్లరేషన్ జిఎం శివన్నారాయణ, పదోన్నతి పొందిన ఎజిఎం రాజ్‌కుమార్‌ను మార్యదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను వివరించారు. నూతన డ్రిల్ విధానాన్ని ప్రవేశ పెట్టి పాతపద్ధతికి స్వస్తి చెప్పాలన్నారు. ఎక్స్‌ప్లరేషన్ వర్క్ షాపులో నూతన యంత్రాలను తీసుకురావాలని కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు త్వరితగతిన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి సామల రాము, ఉపాధ్యక్షుడు క్రిష్టాఫర్, పిట్ కార్యదర్శి బండి సదానందం, పిట్ సహాయ కార్యదర్శి తుమ్మ రవికుమార్, నాయకులు దావా వెంకటేశ్వర్లు, కొండల్, జే రమేష్, పుల్లాచారి, నవ్య, అనూష, ఫిరోజ్‌ఖాన్ తాండ్ర రాజమల్లు, మాదాపూర్ తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం ఏరియా ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/భద్రాచలం :** మారుమూల గిరిజనుల ఆరోగ్య స్థితిగతులు, ముఖ్యంగా నవజాత శిశు రమణాలు జరగకుండా చేసే బాధ్యత సంబంధిత వైద్యాధికారులదే అని నీతి అయోగ్ కన్సల్టెంట్ ఉమాంగ్ కచోట్ అన్నారు. గురువారం భద్రాచలం ఏరియా ఆస్పత్రిని జిల్లా అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో జరుగుతున్న మాతృ, నవజాత శిశు సంరక్షణ సేవలు ఎలా అందుతున్నాయి. సదుపాయాలు, మెటర్నిటీ వార్డ్, ఎస్ఎన్‌సియు, ఎన్ఆర్‌సిఎయు వంటి విభాగాలను సందర్శించి అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రసవం అనంతరం బేబీలను బరువు పరీక్షించడం, అందుకు అవసరమైన పరికరాలు ఏమేమి ఉన్నాయి అనేదానిపై నిశితంగా పరిశీలించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. నవజాత శిశువుల మరణాల రేటుపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇతర జిల్లా కంటే భద్రాద్రి జిల్లాలో నవజాత శిశు మరణాల రేటు తక్కువగా ఉందని, గిరిజనులకు కూడా వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. మారుమూల గిరిజనులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు కావాల్సిన వస్తు సామాగ్రిపై ప్రతిపాదనలు చేసి పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ అధికారి సంజీవరావు, నీతి అయోగ్ అసిస్టెంట్ కన్సల్టెంట్ వననీత్, ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ డా. రాజశేఖర్, పర్యవేక్షకుడురామకృష్ణ, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గురువారం మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐదుగురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను సర్పంచ్ కాపా ఆదినారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తుందన్నారు. పేదింటి ఆడపిల్ల పెళ్లికి కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భూక్యా కృష్ణ, కిలారు వెంకటరమణ, అంకప్పారావు, బొలగాని రామలింగం, బానోత్ చిన్న పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యం పట్ల నమ్మకం పెరగాలి

అర్ధరాత్రి వెళ్లినా వైద్యులు ఉంటారన్న నమ్మకం కల్పించాలి

వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి మంత్రి పొంగులేటి శంకుస్థాపన

కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్యం పట్ల ప్రజల్లో నమ్మకం కలిగించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తిరుమలాయపాలెంలో పర్యటించి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి రూ. 26 కోట్లతో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 39 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో రూ. 26 కోట్లతో 100 పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నామన్నారు. గిరిజనులు అధికంగా ఉండే ఈ మండలంలో ఎటువంటి అత్యవసర వైద్యం కోసమైనా ఖమ్మం వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇక్కడ ప్రసవాలకు అవసరమైన వసతులు కల్పించి స్టాఫ్‌ను నియమాకం చేశామన్నారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే జిల్లా ఆసుపత్రిని మరిపించేవిధంగా అన్ని వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. విద్య,వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. అర్ధరాత్రి వెళ్లినా ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటారని ప్రజలకు నమ్మకం కల్పించాలన్నారు. వైద్యులు స్థానికంగా అందుబాటులో ఉండాలని తెలిపారు. ఇటీవల ఇల్లందు, చర్ల, పినపాకలో పర్యటించినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులను పరిశీలిస్తే ఆశ్చర్యం కలిగిందని అక్కడ సిబ్బంది మంచి పనితీరుతో అద్భుత ఫలితాలు వస్తున్నాయన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించే వైద్య సిబ్బందికి ప్రత్యేక బహుమతులు పాలేరు నియోజక వర్గంలో అందిస్తామని మంత్రి తెలిపారు. పాలేరు నియోజక వర్గ పరిధిలో రెండు 100 పడకల ఆసుపత్రులను నిర్మించడంతో వైద్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్, హౌజింగ్ పిడి శ్రీనివాస్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ చందు నాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యశాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు, ఎంపిడివో సిలాబ్ సాహెబ్, తహసీల్దార్ విల్సన్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు ఓసీ విస్తరణలో భూ నిర్వాసితుల పేర్ల దుర్వినియోగం

రూ.కోటి వసూళ్ల ఆరోపణ



**ప్రజాపక్షం/మణుగూరు :** సింగరేణి సంస్థ మణుగూరు ఓపెన్ కాస్ట్ విస్తరణ నేపథ్యంలో, భూసేకరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. అసలు భూ యజమానుల కంటే కొసరోళ్ల పేర్లను ఎక్కువగా నమోదు చేసి, వారి ద్వారా అధిక మొత్తంలో పరిహారం పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. సింగరేణి సంస్థ తన బొగ్గు ఉత్పత్తిని పెంచుకునేందుకు మణుగూరు ఒసిని విస్తరించాలని నిర్ణయించింది. ఈ విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న వారి పేర్లను నమోదు చేసే ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా, గతంలో ఒసి ఏర్పాటు సమయంలో పరిహారం విషయంలో చక్రం తిప్పిన ఒక వ్యక్తి, ఇప్పుడు కూడా అదే తరహాలో వ్యవహరిస్తున్నారని సమాచారం. ఆ వ్యక్తి, పాత బాండ్లను అధిక ధరకు కొనుగోలు చేసి, వాటిని కొత్తగా నమోదు చేయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అంతా నేను చూసుకుంటాను అని చెప్పి, కొసరోళ్ల నుంచి ఒక్కొక్కరి నుంచి లక్ష రూపాయల చొప్పున ఇప్పటికే సుమారు కోటి రూపాయలు వసూలు చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ అక్రమాల వల్ల సింగరేణి సంస్థకు ఊహించిన దానికంటే మూడు రెట్లు ఎక్కువ నష్టపరిహారం చెల్లించాల్సి వస్తుందని, తద్వారా సంస్థకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ వ్యవహారంపై రెవిన్యూ అధికారులకు సమాచారం ఉందా లేదా అనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూసేకరణ ప్రక్రియలో పారదర్శకత కొరవడిందని, అర్హులైన వారికి న్యాయం జరగడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. భూనిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందేలా చూడటం, ప్రభుత్వ సంస్థలకు ఆర్థిక నష్టం కలగకుండా నివారించడం అధికారుల బాధ్యత. ఈ విషయంలో రెవెన్యూ, సింగరేణి అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది.

## ఇరాన్‌పై దాడులకు నిరసనగా ట్రంప్ దిష్టిబొమ్మ దహనం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడులతో మనదేశానికి తీవ్రమైన ఇంధన సంక్షోభం తప్పదని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి. రామయ్య తెలిపారు. పార్టీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో ప్రదర్శన నిర్వహించారు. అమెరికా యుద్ధోన్మాది ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ గల్ఫ్ దేశాల్లో ఆయిల్‌పై ఆధిపత్యం కోసం అమెరికా చేస్తున్న నర మేధాన్ని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు. యుద్ధం ఇలాగే కొనసాగితే భారతదేశంలో చమురు సంక్షోభం ఏర్పడుతుందన్నారు. ఇప్పటికైనా అమెరికా, ఇజ్రాయిల్‌లు ఇరాక్‌పై చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలన్నారు. ఈ యుద్ధాన్ని భారతదేశం కూడా ఖండించాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, నగర కార్యదర్శి శోభ, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ శిరోమణి, కె. శ్రీనివాస్, జె. లెనిన్, చందు, బజార్, నన్నే శ్రీను, తిరపయ్య, దాసు, సైదులు, రామరాజు, రవి పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు విధానాలను ప్రతిఘటించాలి

సిపిఐ(ఎంఎల్) ఎన్‌డి

కేంద్ర కమిటీ సభ్యురాలు టాన్య



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు విధానాలను ప్రతిఘటించాలని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు టాన్య పిలుపునిచ్చారు. గురువారం ఖ మ్మం నగరంలోని జూబ్లీక్లబ్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ మహాసభకు నూరు వసంతాల సందర్భంగా సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు కా॥ చం ద్ర పుల్లారెడ్డి హాల్‌లో కేంద్ర కమిటీ సభ్యులు బి. భాస్కర్ అధ్యక్షతన జరిగింది. సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జెండాను కేంద్ర కమిటీ సభ్యురాలు పి. టాన్య ఆవిష్కరించారు. అమర వీరులను స్మరిస్తూ అరుణోదయ సాంస్కృతిక కళాకారులు పాటలు పాడారు. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ సభ్యురాలు టాన్య మాట్లాడుతూ దేశంలోని మేధావులు, ఉద్యమకారులు, ప్రగతిశీల శక్తులు, కమ్యూనిస్టు విప్లవకారులు అంద రూ ఏకమయ్యారన్నారు. 1926లో తాస్కంట్ లో మొదటి మహాసభ జరిగి నేటికి నూరేళ్లు పూర్తయిందన్నారు. సిపిఐ పార్లమెంటరీ పంథా ను తీసుకోవడంతో కమ్యూనిస్టు విప్లవకారులు సిపిఐ నుండి బయటకు వచ్చి మార్క్సిస్టుగా సిపి(ఐ)ఎం గా పార్టీని ప్రారంభించారన్నారు. సిపిఎం పార్టీ కూడా ఎన్నికల పంథాను తీసుకోవడంతో సిపిఎం నుండి ఆంధ్ర విప్లవకారులు తెగతెంపులు చేసుకుని ఆంధ్రప్రదేశ్ విప్లవకారుల సమన్వయ కమిటీ పేరుతో సిపిఐ(ఎంఎల్) పార్టీని కొనసాగించారన్నారు. చంద్ర పుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమె ల నాగిరెడ్డి, కొల్ల వెంకయ్య తదితరులు భారత విప్లవ పంథాను కొత్త పుంతలు తొక్కించరన్నారు. దేశంలో విప్లవకారులంతా ప్రతిఘటన పోరాటాన్ని సాయుధ పోరాట పంథాను ముందుకు తీసుకు వచ్చారన్నారు. కేంద్రంలోని బి జెపి మోదీ ప్రభుత్వం ఫాసిస్టు పాలన కొనసాగిస్తుందన్నారు. ప్రజా రైతు కార్మిక వ్యతిరేక వి ధానాలను అవలంభిస్తుందన్నారు. ప్రశ్నించే గొంతుకలను, ఉద్యమించే ప్రజలను నిర్బంధిస్తున్నారన్నారు. తక్షణమే మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను విడనాడాలన్నారు. లేని ఎడల దేశంలో పెద్ద ఎత్తున పోరాటాలు ముందుకు వస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) ఎన్‌డి కేంద్ర కమిటీ నాయకులు అశోక్ గాయల్, ఆరెల్లి కృష్ణ, కె. విశ్వనాథ్, రైతు కూలీ సంఘం ఎపి రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్, భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం సంయుక్త జిల్లా కమిటీ కార్యదర్శి సురేందర్, నాయకులు రామ్మూర్తి, సాంబ, సాయులు, ఉపేందర్, యలమద్ది కళాధర్, కె. నాగేశ్వరరావు, బట్టు, రవిరాజ్, చిట్టిబాబు, నున్నా అప్పారావు పాల్గొన్నారు.

## పదవ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి

విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థులు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలకు హాజరు కావాలని, నూరు శాతం ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం ఖమ్మం రూరల్ మండలం కోదాడ క్రాస్ రోడ్డు వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులం (బాలికల)ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. మౌలిక సదుపాయాలు, వంటగది పరిశుభ్రత, ఆహార నాణ్యత, నిల్వ విధానాలు, బియ్యం, పప్పులు, సరుకులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు కామన్ మెనూ ప్రకారం అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం కలెక్టర్ పదవ తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టి పరీక్షలకు హాజరు కావాలని, ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంత సమయం చదువుతున్నాం అనేదాని కంటే ఎంత శ్రద్ధగా చదువుతున్నామనేదే ముఖ్యమన్నారు. ఉపాధ్యాయుల సహకారం తీసుకుంటూ పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. అధిక సంఖ్యలో ప్రీ ఫైనల్ పరీక్షలు రాయడం వల్ల తుది పరీక్షలను ఎటువంటి ఒత్తిడి లేకుండా సులభంగా రాయగలుగుతామన్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు కొంత సమయం శ్వాస సంబంధిత వ్యాయమాలు, యోగా వంటివి చేయాలని విద్యార్థులకు సూచించారు. బయట ఆహారం తీసుకోవద్దని, మంచినీటిని తగినంతగా తాగాలని, ఆరోగ్యంగా ఉంటేనే చదువు మీద దృష్టి పెట్టగలుగుతామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు ఇచ్చే అతి పెద్ద బహుమతి అని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం మెనూ ప్రకారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఓ జ్యోతి, ప్రిన్సిపాల్ కె. శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు సిహెచ్ ఏల్లిశ్వరి, జి. సంధ్యారాణి, కె. విజయలక్ష్మి , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైప్‌లైన్లలో సమస్యలు పరిష్కరించాలి

మున్సిపాలిటీలో తాగునీటి సమస్యను నివారించాలి

సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య



**ప్రజాపక్షం/మణుగూరు :** వేసవి రాకముందే మంచినీటి సమస్యలు తలెత్తుతున్నాయని మిషన్ భగీరథ పైప్‌లైన్ లలో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని, మణుగూరు మున్సిపాలిటీలో తక్షణమే మంచినీటి సమస్య పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక శ్రామిక భవనంలో బొల్లం రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో తీవ్ర మంచినీటి సమస్య నెలకొన్నదని అన్నారు ప్రధానంగా శివలింగాపురం, బాపనగుంట గ్రామాలలో సరైన మంచి నీటి సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వేసవి రాకముందే ప్రజలకు మంచినీరు అందించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులలో మంచి నీటి సమస్య ఉన్నదని అన్నారు. మండలంలో మిషన్ భగీరథ పైపు లైన్‌లలో ఉన్న సాంకేతిక సమస్య కారణంగా మంచినీరు ప్రజలకు అందుబాటులోకి రావడం లేదన్నారు. వెంటనే పైపులైన్ పునర్నిర్మాణం చేపట్టి అందరికి నిరంతర నీరందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గద్దల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, సీనియర్ నాయకులు కొడిశాల రాములు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పిట్టల నాగమణి, మడి నరసింహారావు, మండల కమిటీ సభ్యులు కుంజ రాజు, ఉత్పతల నరసింహారావు, తోట పద్మ ,గుండి భీమయ్య, సున్నం మల్లేష్, దొడ్డి నిర్మల, గుండి రమేష్, ఎస్.కె ఖతీజా బేగం, టేగం సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

### విజయలక్ష్మి మృతిపట్ల సిపిఐ సంతాపం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** జడ్పి మాజీ ఛైర్మన్ గోనెల విజయలక్ష్మి మృతి పట్ల సిపిఐ ఖమ్మం జిల్లా సమితి తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడ్డారని సురేష్ తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. సంక్లిష్ట పరిస్థితుల్లో ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించిన ఆమె ఎంతో నిబద్ధతతో అన్ని పక్షాలను కలుపుకుని ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు సురేష్ తెలిపారు.

## మైసయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం డిమాండ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రిటైర్‌మెంట్ బకాయిలు సకాలంలో అందక ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఎఆర్ ఎస్ఐ కుక్కల మైసయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. రెండు వారాల క్రితం మృతిచెందిన మైసయ్య భార్య భాగ్యమ్మ బుధవారం హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించింది. ఆమె భౌతికాయాన్ని ఖమ్మం నగరానికి తీసుకు వచ్చిన విషయం తెలుసుకున్న విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్. రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకటనారాయణ గురువారం భాగ్యమ్మ మృతదేహాన్ని సందర్శించి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్‌మెంట్ బకాయిలు మైసయ్య మరణానంతరం ప్రభుత్వం విడుదల చేసిందని సకాలంలో ఆ డబ్బు అందక ఆర్థికంగా, అనారోగ్య సమస్యలతో దంపతులు ఇద్దరు మృతిచెందారన్నారు. మైసయ్య, భాగ్యమ్మ మృతితో వారి ముగ్గురు కుమారులు అనాథలయ్యారన్నారు. వారి పెద్ద కుమారుడు ప్రకాష్ దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడని నెలకు రూ. 20వేలు ఖర్చు అవుతుందని వారు తెలిపారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మైసయ్య మృతికి పరిహారంగా వారి కుమారునికి ప్రభుత్వ ఉద్యోగం లేదా పెన్షన్ ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ అధికారులు బోడేపూడి రాజారావు, ప్రసాదరావు, దామోదర్‌రావు, కిషోర్‌బాబు, ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్‌పై కేసు నమోదు

**ప్రజాపక్షం/ చింతకాని :** రేషన్ దుకాణంలో ఉండాల్సిన బియ్యం నిల్వలో తేడా ఉండడంతో సదరు రేషన్ డీలర్‌పై పౌర సరఫరాల అధికారులు కేసు నమోదు చేశారు. గురువారం జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ నాగిలిగొండలో రేషన్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణంలో ఉండాల్సిన బియ్యం నిల్వలలో భారీ తేడా ఉన్నట్లు గుర్తించారు. రికార్డుల ప్రకారం దుకాణంలో 112.61 క్వింటాళ్ల ధాన్యం ఉండాల్సి ఉండగా కేవలం 52.50 క్వింటాళ్లు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. దీనితో సంబంధిత రేషన్ డీలర్‌పై 6ఎ కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు పౌర సరఫరాల అధికారి తెలిపారు. ఈ సందర్భంగా డిసిఎస్‌వో చందన్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల డీలర్లు నిబంధనల మేరకు రేషన్ బియ్యం పంపిణీ చేయాలని తెలిపారు. నిల్వలో తేడా ఉన్నట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు అందాల్సిన నిత్యావసర సరుకులలో అవినీతి జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ షాపులపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డిటిలు విజయ్‌బాబు, ఎం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఎస్‌పి నితిక పంత్



ప్రజాపక్షం / కాగజ్ నగర్ : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్‌పి నితిక పంత్ ఆదేశించారు. గురువారం కాగజ్ నగర్ మండలం ఈజ్ గావ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరెగూడ గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించారు.పోలీస్ కళాబృందం సభ్యులు పాటల ద్వారా వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని పోలీసులు సూచించారు. అతివేగం ప్రమాదకారి అని, వేగ పరిమితులను పాటిస్తూ ప్రయాణించాలని కోరారు. రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండటం వల్ల విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు రోహిత్, రామ్ చందర్ పాల్గొన్నారు.

## ఉపాధి పథకాలపై అవగాహన



ప్రజాపక్షం/సారంగాపూర్ : సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) గ్రామ మహిళా ప్రాంగణంలో కేంద్ర సూక్ష్మ ,చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఉపాధి సృష్టి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.నిర్మల్ లోని ఉపాధి అ భివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్,మహిళా అభివృద్ధి సంస్థ ప్రతినిధి విజయలక్ష్మి పాల్గొని ఉపాధి సృష్టి పథకం,ఆహార ప్రాసెసింగ్‌కు సంబంధించిన పథకాల గురించి అలాగే ఆర్థిక అక్షరాస్యతపై వివరించారు.యువత ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధి అభివృద్ధి కేంద్రం మేనేజర్ అభినయ్ దీప్,సహాయ మేనేజర్ తేజేశ్వి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్యం

జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిరోజు మెరుగైన పారిశుధ్యం కొనసాగించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు.'ప్రజా పాలనప్రగతి ప్రణాళిక' కింద చేపట్టిన 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా,గురువారం ఉదయం మామడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు.గ్రామాలలో ఆసుపత్రులు,కార్యాలయాలు, వీధులు,అన్ని ప్రాంతాలలో పరిశుభ్రతను కొనసాగించాలని చెప్పారు.పిచ్చి మొక్కలు,చెత్తాచెదారం తొలగించాలని వివరించారు.ఆసుపత్రి ప్రాంగణం మొత్తం శుభ్రంగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణం పరిశుభ్రంగా ఉంటే,చికిత్సల కొరకు వచ్చే ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం ఉంటుందని వివరించారు.డిపిఒ శ్రీనివాస్,ఎంపీడీవో సుశీల్,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకూ సేవా కార్యక్రమాలు

లీలా గ్రూప్ చైర్మెన్ డాక్టర్ మోహన్‌నాయక్



ప్రజాపక్షం/రామాయంపేట: మాయంపేట, నిజాంపేట మండలాల్లో ఇకపై ప్రతి ఇంటికి సేవా కార్యక్రమాలు విస్తరిస్తానని లీలా గ్రూప్ చైర్మెన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మోహన్‌నాయక్ తెలిపారు. బుదవారం పట్టణంలోని కాంగ్రెస్ నాయకులు సరాపు యాదగిరి నివాసంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు రెండు మండలాల్లో చేసిన సేవలను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సూచనల మేరకు ఇకపై ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వైద్య సేవలు అందిస్తానని ప్రకటించారు. మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజు మాట్లాడుతూ మోహన్‌నాయక్ సేవలను ప్రశంసిస్తూ రాబోయే రోజుల్లో రామాయంపేట పట్టణంలోని అన్ని వార్డుల్లో సేవలు అందించాలని కోరగా డాక్టర్ మోహన్‌నాయక్ సానుకూలంగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సరాపు యాదగిరి, దేమె యాదగిరి, ఇసుక ప్రకాష్, చింతల స్వామి, కిష్టారెడ్డితో పాటు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు




ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్: విశ్వబ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం రెండువేల కోట్ల రూపాయల నిధులతో విశ్వబ్రాహ్మణ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని 50 సంవత్సరాలు నిండిన ప్రతి విశ్వకర్మకు 5 వేల రూపాయల పెన్షన్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. హనుమాండ్ల చారి అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనాదిగా సమాజంలో వివాహానికి ప్రధానమైన పుస్తె మెట్టెలు ప్రధాన ఉంగరం విశ్వబ్రాహ్మణుల హక్కు అని ఆ వస్తువులను కార్పొరేట్ జువెలరీ కౌంటర్ల మీద అమ్మకుండా నిషేదించాలని దీనివల్ల విశ్వబ్రాహ్మణులకు కులవృత్తికి పని కల్పించిన వారు అవుతుందని ప్రభుత్వానికి విన్నవించారు. అంతేకాకుండా విశ్వబ్రాహ్మణుల విశ్వకర్మల పిల్లలకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేయాలని, ఉన్నత విద్య అభ్యసించుటకై విదేశీ విద్యనభ్యసించుటకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని, వీరబ్రహ్మేంద్రస్వామి గుడిలలో ప్రస్తుతం దేవాదాయ శాఖ ఆధీనంలో నడుస్తున్న దూప దీప నైవేద్యాలకు సంబంధించినట్లుగా ఆయా దేవాలయాలకు సైతం వర్తించేలా చూడాలని, ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ విశ్వకర్మల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ప్రధాన కార్యదర్శి తంగేల్లపల్లి శ్రీనివాసాచారి, జిల్లా అధ్యక్షులు కిషన్ చారి, చంద్రశేఖర్, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

# పకడ్బందీ ప్రణాళికతో ప్రజాపాలన

ఐదు దశల్లో 99 రోజుల యాక్షన్ ప్లాన్

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రజాపక్షం / మెదక్ : రాష్ట్ర ప్రభుత్వం మార్చి 6వ తేదీ నుండి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని మెదక్ జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలు కార్యాచరణ అమలుపై రెవెన్యూ, పంచాయతీరాజ్, ప్రణాళిక, ఇరిగేషన్, రవాణా, వ్యవసాయం, ఉద్యానవన, విద్య, వైద్య, మహిళా శిశు సంక్షేమ, హౌసింగ్, తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అయిదు దశల్లో అమలు చేయనున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ క్షుణ్ణంగా వివరించారు. ఆయా శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు.ప్రజా సమస్యలను పరిష్కరించడం, సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాల పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశం పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యాలయాల పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రజలకు సమయానుకూల సేవలందించడం లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో తడి పొడి చెత్త వేరు సేకరణ, పిచ్చి మొక్కల తొలగింపు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిర్మూలన, ప్రభుత్వ భవనాల శుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 11 వరకు ఆరోగ్యం ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశం పై ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 13 నుండి ఏప్రిల్ 18 వరకు సురక్షితంగా చేరుకోండి కార్యక్రమం రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత పై అవగాహన, ట్రాఫిక్ నియమాల కఠిన అమలు, హెల్మెట్ సీట్‌బెల్ట్ వినియోగం పై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 25 వరకు సంక్షేమం అంశంపై ఎస్సీ, ఎస్‌టి,బీసీ, మైనారిటీ సంక్షేమ



శాఖలు ఇందిరమ్మ ఇల్లు పథకం అమలు స్థితిపై సమీక్షలు నిర్వహించి, ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు పిల్లల భద్రత, రక్షణ డ్రగ్స్‌కు నో కార్యక్రమం పై పాఠశాల్లలో అవగాహన చేపట్టాలన్నారు. మే 4 నుండి మే 9 వరకు వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల, విద్యుత్ శాఖలు సమన్వయంతో రైతులకు సాగు సలహాలు ఎరువులు విత్తనాల లభ్యత, సాగునీటి సరఫరా,నిరంతర విద్యుత్ సరఫరా అంశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. మే 11 నుండి 16 వరకు విద్య అంశం పై పాఠశాలల మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, బోధన నాణ్యతపై సమీక్షలు నిర్వహించబడతాయని వివరించారు. మే 18 నుండి మే 23 వరకు యువత క్రీడలు అంశం పై క్రీడా పోటీలు, యువజనోత్సవాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు చేపట్టాలని సూచించారు. మే 25 నుండి మే 30 వరకు మహిళలు అంశంపై మహిళా సాధికారత, స్వయం ఉపాధి, స్వయం సహాయక సంఘాల బలోపేతం, రుణాల సద్వినియోగం పై చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జూన్ 1 నుండి జూన్ 12 వరకు పర్యావరణం అంశం పై వృక్షారోపణ, ప్లాస్టిక్ నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మార్చి 6 నుండి 16 వరకు నిర్వహించనున్న పరిశుభ్రత కార్యక్రమాపై ప్రత్యేక దిశానిర్దేశం చేస్తూ ప్రతి గ్రామం, మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. 99 రోజుల కార్యాచరణలో భాగం గా ప్రతిరోజు నిర్వహించిన కార్యక్రమాల పూర్తి వి వరాలను రోజువారీ ప్రగతి నివేదికల రూపంలో సమర్పించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా ఎస్‌పి డివి శ్రీనివాస రావు, అదనపు ఎస్‌పి మహేందర్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులుపాల్గొన్నారు.

## చెరువుల మరమ్మతులకు రూ.1.5 కోట్ల నిధులు

ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్

ప్రజాపక్షం/బైంసా : ముధోల్ నియోజకవర్గం లో ఐదు చెరువుల మరమ్మత్తులకు కోటి 50 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ తెలియజేశారు.కుంటాల మండలంలోని దౌనెల్లి చెరువు కు 34.50 లక్షలు,ఇడ అందకూర్ పెద్ద చెరువుకు 22.20 లక్షలు,పెంచికల పాడ్ గ్రా మంలో గోధుమ కుంట చెరువుకు 22.15 లక్షలు,కల్లూరు గ్రామంలో పెద్ద చెరువుకు 33.60లక్షలు,కుభీర్ మండలంలోని హంపోలి చెరువుకు 39.50 లక్షల రూపాయల నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. త్వరలోనే టెండర్ ప్రక్రియ చేపట్టి పనులు ప్రారంభిస్తామన్నారు.రైతులకు సాగు నీరు అందించడమే తన లక్ష్యమని ,పలుమార్లు సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సమస్యను విన్నవించడంతో దశల వారిగా నిధులు ఇవ్వడం సంతోషకరమన్నారు. సాగునీటి రంగానికి కోట్లాది రూపాయల నిధులు తేవడం జరిగిందని,ఈ పాటికే పలు పనులు ప్రారంభం అయ్యాయని,పూర్తి స్థాయిలో సాగునీటి రంగాన్ని అభివృద్ధి చేసి రైతులకు సాగునీరు ఇస్తామన్నారు.ముఖ్యమంత్రికి, మంత్రులకు అయన కృతజ్ఞతలు తెలిపారు.

# మెరుగైన మౌలిక సదుపాయాలే లక్ష్యం

కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజాపక్షం/నిర్మల్ : నిర్మల్ పట్టణ వాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పా టు, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్ర భుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలను క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.గురువారం ఉదయం ఆమె నిర్మల్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి,పారిశుద్ధ్యం,త్రాగునీరు, వి ద్యా వసతులను స్వయంగా పరిశీలించారు.అధికారు ల పనిపై అసహనం వ్యక్తం చేస్తూ,విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ప్రజలతో కలెక్టర్ ముఖాముఖి

పట్టణంలోని బుధవార్ పేట 38వ వార్డులో పర్యటించారు.మున్సిపల్ అధికారులతో కలిసి వీధివీధిగా తిరుగుతూ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు .ప్రతిరోజు చెత్త సేకరణ వాహనాలు వస్తున్నాయా? డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారా?అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు.తడి,పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని,రహదారులపై చెత్త వేయకుండా బాధ్యతగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు.మురుగు కాలువల్లో తీసిన పూడికను రోడ్డపైనే వదిలేయకుండా తక్షణమే తరలించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.అవసరమైన చోట సీసీ రోడ్లు,డ్రైనేజీలకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

### నీటి సరఫరాపై ప్రత్యేక నిఘా..

ఎండలు ముదురుతున్న నేపథ్యంలో పట్టణంలో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా సమయపాలన పాటించాలని,ఎక్కడైనా పైపులైన్ల లీకేజీలు ఉంటే వెంటనే సరిచేయాలని ఆర్డబ్ల్యూస్ ఇంజనీర్లకు ఆదేశాలిచ్చారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు స్పందించి పరిష్కరించాలని,ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని పేర్కొన్నారు.

### కెజిబివిలో ఆకస్మిక తనిఖీ...

విద్యార్థులతో అల్పాహారం అనంతరం కలెక్టర్ స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ)సందర్శించి అందరినీ ఆశ్చర్యపరిచారు. తెల్లవారుజామునే పాఠశాలకు చేరుకున్న ఆమె, విద్యార్థులతో కలిసి ఉదయపు ప్రార్థనలో పాల్గొన్నారు.అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న,ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్,తహసీల్దార్ రాజు,వార్డు కౌన్సిలర్ నాందేడపు అన్నపూర్ణ, అధికారులు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



# రైస్ మిల్లుల్లో విజిలెన్స్ సోదాలు..

బ్యాంకు గ్యారంటీపై విచారణ

మిల్లర్ల మాయాజాలం!



ప్రజాపక్షం / సిర్పూర్ టి : సిర్పూర్ టి మండలంలోని రైస్ మిల్లులపై విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ప్రభుత్వానికి సిఎంఆర్ కింద సరఫరా చేయాల్సిన బియ్యం, బ్యాంకు గ్యారంటీల వ్యవహారంలో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన ధాన్యం, బియ్యం సరఫరాలో భారీగా అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో విజిలెన్స్ ఎన్ ఫోర్స్‌మెంట్ అధికారులు రంగంలోకి దిగారు. సోదాల్లో భాగంగా సిర్పూర్ లోని శ్రీ సాయిబాలాజీ అగ్రోటెక్ రైస్ మిల్లు, దత్తసాయి రైస్ మిల్లు వద్ద అధికారుల బృందం రికార్డులు, స్టాక్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించింది. గోదాముల్లో నిల్వ ఉన్న ధాన్యం, బియ్యం నిల్వలను తనిఖీ చేయడంతో పాటు రవాణాకు సంబంధించిన రికార్డులు, ఖాతా పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. మూడు రైస్ మిల్లుల్లో కలిపి సుమారు రూ.12.76 కోట్ల బ్యాంకు గ్యారంటీలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో శ్రీ సాయి బాలాజీ అగ్రోటెక్ రైస్ మిల్లుకు సంబంధించి రూ.7 కోట్ల విలువైన బ్యాంకు గ్యారంటీ పత్రాలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవడంతో అధికారులు లోతైన విచారణ జరుపుతున్నారు. ఈ బ్యాంకు గ్యారంటీల వ్యవహారంలో ఇప్పటికే ఒకరిని రిమాండ్ కు తరలించినట్లు సమాచారం. ముఖ్యంగా వివాదాస్పదంగా మారిన శ్రీ సాయిబాలాజీ రైస్ మిల్లు గతంలో రెండు సార్లు సీజ్ కు గురవ్వగా, ప్రస్తుతం మరోసారి అధికారులు ఈ మిల్లును సీజ్ చేశారు. పదేపదే నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతుండటంతో అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. విజిలెన్స్ అధికారుల వరుస దాడులతో సిర్పూర్ ప్రాంతంలోని రైస్ మిల్లర్లలో కలకలం రేగింది. తనిఖీల అనంతరం మిల్లర్ల నుంచి వివరణ కోరామని, పూర్తిస్థాయి విచారణ తర్వాత మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

## న్యాయవాదిపై చేయిచేసుకోవడం హేయమైన చర్య

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాములు

ప్రజాపక్షం / మెదక్ : న్యాయవాది సతీష్‌పై పాపన్న పేట ఎస్ఐ చేయి చేసుకోవడం హేయమైన చర్య అని మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మార్కంటి రాములు అన్నారు. గురువారం న్యాయవాది సతీష్‌పై పాపన్నపేట ఎస్ఐ సారా శ్రీనివాస్ గౌడ్ చేయి చేసుకోవడం పట్ల మెదక్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రధాన గేటు వద్ద న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. సతీష్‌కు జరిగిన రోడ్డు ప్రమాదం పైన కేసు పెట్టేందుకు వెళ్ళిన న్యాయవాది పై దుర్భాషాలు ఆడుతూ ఎస్ఐ చేయి చేసుకోవాడని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. న్యాయవాదిగా తనకు తను పరిచయం చేసుకున్నప్పటికీ జరిగిన యాక్సిడెంట్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన సతీష్‌పై ఎస్ఐ దురుసుగా ప్రవర్తించడం దుర్మార్గమైన చర్య అన్నారు. దాడి చేసిన ఎస్ఐపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేంత వరకు న్యాయవాద విధులను బహిష్కరిస్తూ, నిరసన తెలియజేస్తామన్నారు.



## విద్యామిషన్ సిఫారసులతో ప్రభుత్వ పాఠశాలలకు నష్టం

ప్రజాపక్షం/నిజామాబాద్ : పలు విద్యా కమీషన్ సిఫారసులతో ఆకునూరి మురళి సమర్పించిన విద్యావిధాన పత్రంలోని పలు సిఫారసులతో భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల మనుగడ కష్టమని పీఆర్‌టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్ రెడ్డి, కిషన్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులకు వేతనాలు ఎక్కువున్నాయని ఆత్మస్థైర్యం దెబ్బ తీయటం భావ్యం కాదన్నారు. అలాగే పర్మినెంట్ టీచర్లు వద్దని పదోన్నతులు ఇవ్వద్దని అనడం భావ్యం కాదు. ప్రతి మండలంలో 12 పబ్లిక్ పాఠశాలల స్థాపనతో మిగతా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతాయి. తద్వారా పేద పిల్లలకు విద్య దూరమవుతుంది. అలాగే ప్రాథమిక విద్యకు పూర్వ ప్రాథమిక విద్యను మిళితం చేయటం బడ్జెట్‌లో విద్యకు 18 శాతం కేటాయించడం మధ్యాహ్న భోజన బిల్లులు రెట్టింపు చేయడం మొదలైన అంశాలను స్వాగతిస్తున్నామన్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులు నరేష్, కన్వీనర్ రవీందర్‌రెడి, పీఆర్‌టీయు నాయకులు నరేష్, అబ్దుల్లా పాల్గొన్నారు.




## అర్హులైన ప్రతి పేదకూ ఇందిరమ్మ ఇల్లు

మాజీ ఎమ్మెల్యే తూకుంట నర్సారెడ్డి

ప్రజాపక్షం / గజ్వేల్: పేదవాడి కళ్ళల్లో సంతోషం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం కాగా, అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరీ చేస్తామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లో ఇందిరమ్మ ఇంటిని గృహప్రవేశం చేయించిన సందర్భంగా ఆయన నేతలు ఊడెం సారిక శ్రీనివాస్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ షరీఫ్‌తో కలిసి మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గానికి 35 వేల ఇండ్లను మంజూరు చేయగా, అందులో 80 శాతం లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సైతం లబ్ధిదారుల ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని వెంట వెంటనే బిల్లులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. సొంత స్థలం ఉన్న నిరుపేదలు నేరుగా తమను సంప్రదిస్తే ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేస్తామని పేర్కొన్నారు. అంతేగాకుండా ప్రతి పేదకి రేషన్ కార్డు మంజూరి చేయడంతో పాటు సన్న బియ్యం అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం రూ 2 లక్షల రుణ మాఫీ, రైతు భరోసా, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ అవసరాలకు 200ల యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ 500లకే వంట గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తోందని అన్నారు. గజ్వేల్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సాధ్యమైనంతనిధులు సా ధిస్తూ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం క్రీడా పోటీలు

ప్రజాపక్షం /సంగారెడ్డి : టీఎన్జీవోస్ సంగారెడ్డి జిల్లా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉద్యోగినుల కోసం వివిధ క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగినులతో కలసి కలెక్టర్ క్యారం ,చెస్, వంటి క్రీడలను ఆది అందరిని ప్రోత్సహించారు. మహిళలో ఐక్యత ఆత్మవిశ్వాసం ,ఆరోగ్యకరమైన పోటీ భావన పెంపొందించేందుకు ఈ క్రీడా కార్యక్రమాలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగినుల కోసం షటిల్, బ్యాడ్మింటన్, మ్యూజికల్ చైర్ క్యారం చెస్ తదితర క్రీడలను నిర్వహించారు. మహిళా ఉద్యోగినులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం టీఎన్జీ ఎస్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ జావిద్ అలీ, జిల్లా కార్యదర్శి వేల్పూరి రవి ఆధ్వర్యంలో జరిగింది. రాష్ట్ర మహిళబూ కార్యదర్శి నిర్మల రాజకుమారి, సుదామణి, సమన్వయంతో కార్యక్రమం ఘనంగా జరిగింది. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సాదికారతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతి రంగంలో మహిళలు ముందుకు రావాలని వారు పేర్కొన్నారు. క్రీడల్లో విజేతలైన మహిళా ఉద్యోగినులకు అభినందనలు తెలుపుతూ నిర్వాహకులు తేది 090–2026 న బహుమతులు అందజేస్తారు.అదనపు కలెక్టర్ పాండు, సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్, రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారిని లలిత కుమారి టీఎన్జీవోస్ సంఘం అసోసియేట్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్ ,వెంకటరెడ్డి, కోశాధికారి శ్రీనివాస్ ,హెచ్ డబ్ల్యూ ఓ రాష్ట్ర ఫోరమ్, అధ్యక్షులు బాస్కర్, పంచాయతీ సెక్రెటరీ పోరం రాష్ట్ర అధ్యక్షులు బలరాం, ప్రమోద్, సుదారాణి, నాగమణి, పద్మ, నర్సింలు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశం, యాదవరెడ్డి ,కృష్ణ, షకీల్ ,విజయ్ కుమార్, రమేష్ నాగేశ్వరావు, జగన్, వెంకట్, సాయి నాల్గవ తరగతి సంఘ అధ్యక్ష కార్యదర్శులు షరీప్, నాగరాజు, వివిధ శాఖల మహిళా ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కుమారుడిని చంపిన తండ్రి

ప్రజాపక్షం/నిజామాబాద్ : ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామంలో మాదకద్రవ్యాలకు బానిసైన కుమారుడిని హత్య చేసిన ఘటన కలకలం రేపింది. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లవెల్లికి చెందిన కొత్తగుళ్ల లక్ష్మీ (50) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె చిన్నకుమారుడు భాను ప్రకాష్(22) డబ్బుల విషయమై తరచూ తన తండ్రి కొత్తగుళ్ల కిషన్ (55) తో గొడవ పడేవాడని బుధవారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో ఇద్దరి మధ్య మరోసారి గొడవ జరగడంతో కోపంతో కిషన్ ఇంట్లో ఉన్న గొడ్డలితో భానుప్రకాష్ మెడపై దాడి చేయగా అతడు అక్కడికక్కడే మృతి చెందాడని తెలుపగా ఈ ఘటనపై ఇందల్వాయి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ సందీప్ తెలిపారు.



